క్లుప్తంగా

బ్యాంకు ఆఫ్ బరోడా ఉచిత సేవలు

మధురపూడి: బూరుగుపూడిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బ్యాంకు ఆఫ్ బరోడా ఉచిత సేవలందజేస్తోంది. ఆ బ్యాంకు మేనేజర్ జువ్వల సురేష్ స్థానిక హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు జీరో బ్యాలెన్స్ ఖాతాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇందుకోసం విద్యార్థులకు పాస్‌పోర్టు ఫొటోలు తీయించారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్), ఇన్‌స్పైర్ అవార్డు నగదు విద్యార్థుల బ్యాంకు ఖాతాలో నమోదవుతున్న నేపథ్యంలో ఈ సేవలు అందజేశారు.

లెక్చరర్ల సంఘం ఉపాధ్యక్షుడిగా వెంకటకృష్ణ


వెంకటకృష్ణను సత్కరిస్తున్న అధ్యాపకులు

రంగంపేట: కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కె.వెంకటకృష్ణ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 475 మంది ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్లు ఉన్నారని, వీరందరూ నూతన కార్యవర్గం ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణను ఘనంగా సత్కరించామన్నారు.

వడిశలేరులో అన్నసమారాధన

రంగంపేట: వడిశలేరులో కొలువైన శ్రీదేవి-భూదేవి సమేత భజేనారాయణస్వామి వారి దేవస్థానంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాలు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నసమారాధనకు గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విభిన్న నైపుణ్యాలు ఎంతో అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య రామరాజు

రాజానగరం: సివిల్ ఇంజినీర్లకు విభిన్న నైపుణ్యాలు ఎంతో అవసరమని ఉమ్మడి ఏపీలోని విశ్రాత చీఫ్ ఇంజినీర్, ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల జలవనరులు, నీటిపారుదల ప్రాజెక్టుల శాఖ సలహాదారు ఆచార్య పెనుమత్స రామరాజు అన్నారు. మట్టిలో కంటే రాతిలో లభించే భూగర్భ జలాలు ఎంతో బాగుంటాయన్నారు. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.లీలావతి, జీఎం డాక్టర్ పి.సుబ్బరాజు, డైరెక్టర్లు డాక్టర్ పీఆర్‌కే రాజు, డాక్టర్ ఆర్ఎస్ రాజు, హెచ్ఓడీ డాక్టర్ డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌పేటలో విషాదఛాయలు


శేష సాయి గౌతమ్ (ఫైల్)

బిక్కవోలు: ఆర్ఎస్‌పేట పంచాయతీ పరిధిలో తొటపేటలో బుధవారం విషాద ఛాయలు అలుకున్నాయి. బుధవారం తెల్లవారుజామునా మండలపల్లి శేషసాయి గౌతమ్(19) పల్సర్ బైక్ పై సామర్లకోట వెళుతుండగా వేటపాలెం దగ్గర జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. గౌతమ్ తండ్రి శ్రీనివాసరావు లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. తల్లి వెంకటరమణ ఇంటి వద్ద ఉంటుంది. తండ్రికి చేదోడుగా గౌతమ్ ఇటీవల పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడు. అందరితో సరదాగా ఉంటూ ఒక్కసారిగా ప్రమాదంలో మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

ఆదాయపు పన్ను పరిమితిపై హర్షం

అనపర్తి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితి పెంచడంపై పెన్షనర్ల అసోసియేషన్ అనపర్తి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు పీవీఎస్ సూర్యనారాయణ, గొలుగూరి రామారెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది వేతన జీవులకు, పెన్షనర్లకు కొంత ఊరట కలిగినా, స్టాండర్డ్ డిడక్షన్ పెంపు, కనీస ఆదాయం ఐదు లక్షలు పెంచితే మరింత ఊరట కలిగేదని ట్రెజరర్ వి.సుబ్రహ్మణ్యం అభిప్రాయ పడ్డారు.

ఇసుక రవాణా.. బతుకు భరోసా

- ఇసుక తరలింపుతో ఉపాధి
- సుమారు వెయ్యిమందికి ఆధారం
- సీఎం జగన్ నిర్ణయంపై హర్షం


ఎడ్లబళ్లపై ఇసుకను తరలిస్తున్న దృశ్యం

సీతానగరం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ముఖ్యంగా పేదల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారు. ఇలా దేశానికి మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచేలా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగానే గోదావరి పరివాహక ప్రాంతంలో ఎడ్లబండ్లపై ఆధారపడేవారికి జీవనోపాధికి చర్యలు చేపట్టారు. వారు ఎడ్లబళ్లపై ఇసుకను తరలించుకునేందుకు అనుమతి ఇచ్చారు.

జీవనోపాధి

సీఎం జగన్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మండలంలో సుమారు వెయ్యిమంది ఎడ్లబళ్ల యజమానులకు జీవనోపాధి లభిస్తోంది. వీరు రోజూ ఒకొక్క బండి ద్వారా మూడు ట్రిప్పులు ఇసుక తోలకం జరిపి రూ.వెయ్యి సంపాదిస్తున్నారు. ఇందులో కొంత ఎడ్లదాణాకు పోగా రోజుకు రూ.700 మిగులుతోంది. అదే దూర ప్రాంత గ్రామాలకు అయితే రూ.500 నుంచి రూ.వెయ్యి వరకూ ఒక ట్రిప్పుకు ధర పలుకుతోంది. ఎడ్లబళ్లపై ఇసుక రవాణాకు వెసులుబాటు ఇవ్వడంతో వాటి యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తోలకం ద్వారా తమకు ఆదాయం వస్తోందని, దానితో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నామన్నారు.

ఎడ్లబండే ఆధారం

కాలం మారినా, యాంత్రీకరణ పెరిగినా నేటికీ పల్లెల్లో ఎడ్లబళ్లు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా సీతానగరం మండలంలో ఇసుక తరలించడానికి ఇవే ఆధారం. మొక్కజొన్న, వరి, ఇతర ఉత్పత్తులను పొలాల్లో తూకం వేసిన అనంతరం ఎడ్లబళ్లపైనే లారీల వరకూ తరలిస్తుంటారు. దీనికి ప్రధాన కారణం పొలంలో తడి ఆరకపోవడమే. ట్రాక్టర్‌పై తరలించాలంటే అది పొలంలో దిగబడి పోతుందనే కారణంతో ఎడ్లబళ్లను వాడతారు. గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలకు ఎడ్లబళ్ల మీదుగానే ఇసుక తీసుకువస్తున్నారు. మండలంలోని రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, మునికూడలి, బొబ్బిల్లంక తదితర గ్రామాల ఇసుక ర్యాంపు నుంచి ఎడ్లబళ్ల ద్వారా ఇసుక సరఫరా అవుతుంది. ఏటిగట్టును ఆనుకుని ఉన్న గ్రామాలలో బండి ఇసుక రూ.350 గా కొనుగోలు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్లపైనే ఇసుకను తరలించేవారు.

ఇసుకతో ఉపాధి



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఎడ్లబళ్లపై ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చారు. దీంతోవాటి యజమానులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రోజూ ఇసుకను వివిధ గ్రామాలకు తరలించి ఉపాధి పొందుతున్నారు.

– కొంచ భాస్కరరావు, మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు, వంగలపూడి

ప్రతిరోజూ రవాణా



టీడీపీ హయాంలో ఎడ్లబళ్లపై ఇసుక రవాణా జరిగేది కాదు. ఆ సమయంలో వ్యవసాయ పనులకు మాత్రమే అంతంత మాత్రంగా ఎడ్లబళ్లను వాడేవారు. ఇప్పుడు ప్రతిరోజూ ఇసుక రవాణా చేస్తున్నాం. అలా వచ్చిన ఆదాయంలో జీవనం సాగిస్తున్నాం.

– మాదాసు రాంబాబు, సీతానగరం వెలమపేట

తాగునీటి పథకాలకు శంకుస్థాపన


సింగవరంలో శంకుస్థాపనలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: మండలంలోని సింగవరంలో రెండు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులకు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం శంకుస్థాపనలు చేశారు. సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ, ఎస్సీపేటలో వీటిని నిర్మిస్తున్నారు. ఎంపీటీసీ కొమ్మిరిశెట్టి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు చిర్ల పోశియ్య, అంబటి రమణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సింగవరం పంచాయతీలో గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు రూ.77 లక్షలు, సిమెంట్ రోడ్లకు రూ.50 లక్షలు, సిమెంట్ డ్రైనేజీలకు రూ.37 లక్షలు, బల్కమిల్క్ యూనిట్‌కు రూ.15 లక్షలు, రెండు ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌లకు రూ.65 లక్షలు కేటాయించారన్నారు. గ్రామాల అభ్యున్నతికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరేంద్ర కుమార్, సర్పంచ్ సంగన చిన పోశియ్య, వైఎస్సార్ సీపీ నాయకులు జి.గంగాధర్, కాపు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరేంద్ర, వీఆర్వో గంగరాజు పాల్గొన్నారు.

నేడు గోకవరంలో గడపగడపకూ..

గోకవరం: గ్రామంలో గురువారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీపీ సుంకర శ్రీవల్లి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొట్లాట కేసులో 14 మందికి రిమాండ్

మధురపూడి: కోరుకొండ మండలం బుచ్చెంపేట గ్రామంలో ఇరువర్గాల కొట్లాటకు కారకులైన 14 మందిని బుధవారం రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్టు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. గతనెల 28, 31వ తేదీల్లో ఇరువర్గాలు కొట్లాటకు దిగటంతో పలువురికి గాయాలయ్యాయన్నారు. దీంతో 14 మందిపై కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ కోసం జైలుకు తరలించారన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


రంపయర్రంపాలెం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న నాయకులు

గోకవరం: పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ సూచించారు. మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో మంచి ఫలితాల్లో సాధించాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, ఎంఈఓ బి.గౌరమ్మ, పీఎంసీ చైర్మన్ గుప్త, హెచ్ఎం ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి ఫౌండేషన్ సాయం



నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: మండలంలోని పలు బాధిత కుటుంబాలకు జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సీతానగరం, రఘుదేవపురం, రాపాక, చినకొండేపూడి, పురుషోత్తపట్నం, వంగలపూడి గ్రామాల్లోని 25 కుటుంబాలకు జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ వారి అక్షయ సంజీవిని కార్యక్రమంలో బియ్యం, రూ.రెండు వేలు విలువైన నిత్యావసరాల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, వంగలపూడి సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, చిన కొండేపూడి సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ముదునూరి రామకృష్ణంరాజు, సీతానగరం ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, గెద్దాడ త్రిమూర్తులు, ఫౌండేషన్ కోఆర్డినేటర్ జాషువా పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

సీతానగరం: సాస్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం రాత్రి 9.40 గంటలకు ఉద్రిక్తత చోటుచేసుకుంది. రఘుదేవపురం, వంగలపూడి నుంచి అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వివరాలోకి వెళ్లితే.. వంగలపూడికి చెందిన కొత్తపల్లి వీరబాబు అనే వ్యక్తి రఘుదేవపురం బట్టల షాపు యజమాని వద్దకు వెళ్లి రూ.500 ఫోన్‌పే చేయాలని కోరాడు. తన ఖాతాలో నగదు లేదని అతడు చెప్పడంతో వీరబాబు ఆగ్రహంతో దాడి చేశాడు. దీంతో షాపు యజమాని సీతానగరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే క్రమంలో ఇరు వర్గాల జనం పోగవడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన వీరబాబుపై బట్టలషాపు యజమాని వర్గం ఒక్కసారిగా దాడి చేసింది. పోలీసులు వెంటనే స్పందించి కిందపడిన వీరబాబును స్టేషన్‌లోకి తీసుకువెళ్లారు. రాత్రి 10.15 గంటల వరకూ పోలీస్ స్టేషన్ వద్ద జనం ఉన్నారు.

వసంత్ కుమార్ సేవలు చిరస్మరణీయం


మాజీ మంత్రి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఉండవల్లి అరుణ్ కుమార్ తదితరులు

ప్రకాశం నగర్: మాజీ మంత్రి వట్టి వసంత్ కుమార్ అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. స్థానిక ప్రకాశం నగర్ ధర్మంచర హాల్లో ఎస్ఎన్ రాజా, ప్రసాదుల హరినాథ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం వట్టి వసంత కుమార్ సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎంపీ అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు రౌతు సూర్యప్రకాశరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వసంత కుమార్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మాజీ ఎంపీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ వసంత్ కుమార్ అగ్రికల్చర్ బీఎస్సీ, ఎంబీఏ, పీహెచ్‌డీ చేసి, ప్రొఫెసర్‌గా పనిచేసి, రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అవినీతి మచ్చ లేకుండా హుందాగా వ్యవహరించారన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ వసంత్ కుమార్ సేవలు చిరస్మరణీయమన్నారు. సీనియర్ పాత్రికేయుడు వీఎస్ఎస్ కృష్ణకుమార్, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, కాంట్రాక్టర్ మంతెన కేశవరాజు పాల్గొన్నారు.

వైభవంగా వీరేశ్వరస్వామి కల్యాణం


బూరుగుపూడిలో వీరేశ్వరస్వామి కల్యాణం

మధురపూడి: బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్వామికి ఉదయం రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి పల్లకీపై స్వామి, అమ్మవారు ప్రధాన వీధుల్లో ఊరేగారు. మేళతాళాలు, బాజీ భజంత్రీలు, కేరళ డప్పు వాయిద్యాలు, ప్రత్యేక నృత్యాల నడుమ స్వామి అమ్మవార్ల పల్లకీ ఊరేగింపు జరిగింది. అనంతరం పెళ్లిపీటలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు క్రొవ్విడి సత్రాజు, క్రొవ్విడి సూర్యనారాయణమూర్తి దంపతులు పల్లకీ ముందు నడుస్తూ స్వామి, అమ్మవార్లకు పెళ్లి మండపానికి స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చారణ మధ్య అంగరంగ వైభవంగా కల్యాణం జరిగింది. క్రొవ్విడి కుటుంబ సభ్యులు, క్రొవ్విడ వరుణ్, నవీన దంపతులు, సాయి కిరణ్, హనుమశివాని దంపతులు కూర్చున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఏవీఎస్ఎన్ సూర్యనారాయణమూర్తి, బూరుగుపూడి పీఏసీఎస్ చైర్మన్ బుడ్డిక సత్తిబాబు పాల్గొన్నారు.

వేకువనే.. వేగంగా


చంద్రేడులో లబ్ధదారుడికి పింఛను అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ జానీ


పందలపాకలో మహిళకు పింఛను అందిస్తున్న వలంటీర్

రంగంపేట: ప్రతి నెలా ఒకటో తేదీన నిర్వహించే పింఛన్ల పంపిణీని మండలంలో అన్ని గ్రామాల్లో వలంటీర్లు బుధవారం వేకువజామునే అందించారు. మండలంలో మొత్తం 8999 మంది పింఛనుదారులు ఉండగా వారికి తెల్లవారు జామునే నగదు అందించారు. సాయంత్రానికి 90 శాతం పూర్తి చేశారు. గురువారం నూరు శాతం పంపిణీ పూర్తి చేయనున్నారు. ఉదయాన్నే నగదు చేతికి రావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

83 శాతం పింఛన్ల పంపిణీ

బిక్కవోలు: ప్రతి నెలా మొదటి తేదీన అందించే పింఛను వలంటీర్లు తెల్లవారుజామునా నుంచి లబ్ధిదారులకు అందిస్తున్నారు. మండలంలోని 10,552 పింఛనుదారులు ఉండగా 8,771 మందికి అందించారు. తొలి రోజు సాయంత్రం లోపు 83.12శాతం పంపిణీ చేశారు. పందలపాక సచివాలయం-1 పరిధిలో 93.11 శాతం పూర్తి కాగా మండలంలో మొదటి స్థానం ఉంది. బిక్కవోలు సచివాలయం-1 పరిధిలో 73.4 శాతం పూర్తి చేసి చివరి స్థానం ఉన్నట్టు అధికారులు తెలిపారు.

పాండవుల తీర్థం ప్రారంభం


భక్తులతో కిటకిటలాడుతున్న రంపయర్రంపాలెం పాండవుల మెట్ట

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో పాండవుల మెట్ట వద్ద బుధవారం పాండవుల తీర్థం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు మండలం నుంచే కాకుండా చుట్టు పక్కల మండలాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి కొండపైన గుహల్లో ఉన్న పాండవులు, ద్రౌపతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపై పాలు పొంగించి నైవేద్యాలు సిద్ధం చేసి పాండువులకు నివేదించారు. కొండ దిగువన ఉన్న శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ తీర్థానికి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. తీర్థంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి


పుట్టకొండలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు


పుట్టకొండలో జరుగుతున్న రథోత్సవం

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ రథోత్సవం బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. కల్యాణం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 8.10 గంటలకు స్వామి వారికి నిత్యహోమం, సంప్రదాయార్చన, 12 గంటలకు ధ్వజారోహణం, బలిహరణం నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు నరసింహావతార వైభవం, బ్రహ్మాండమైన రథోత్సవం జరిగింది. రాత్రి 10 గంటలకు గరుడు సేవ, పుష్పక వాహన సేవ చేశారు. 12 గంటలకు సముద్ర మహర్షి సంవాదం మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి అనంతరం తెల్లవారు జామున 4 గంటలకు (గురువారం) స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. స్వామివారికి ప్రధాన అర్చకుడు పి.గోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పీఏ అనంతాచార్యులు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి సీహెచ్ వి.రమణమూర్తి పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. పండితులు కల్యాణ క్రతువులను నిర్వహిస్తారు. ఎమ్మెల్యే వెంట అనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచి వల్లు వెంకటరమణ, హితకారిణి సమాజం డైరెక్టర్ వుంద్రు సత్యనారాయణ పాల్గొన్నారు.

పందలపాకలో..

బిక్కవోలు: పందలపాకలోని వెలమపేట కాలువ గట్టు వద్ద ఉన్న అలివేలుమంగా పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు గరిమెళ్ల విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో కాకినాడ చెందిన యాసలపు ఉమామహేశ్వరరావు, భవాని దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. బ్యాంకు వీధిలోని ఆలయంలో అర్చకుడు గరిమెళ్ల గాంధీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పున్నపు శ్రీను, నాగలక్ష్మి దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు.

తంటికొండలో..

గోకవరం: తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, పోస్టల్ కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద స్వామి వారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయం వద్ద స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో స్వామి వారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

సూర్యభగవానుని కల్యాణం

పెదపూడి: గోవింద నామ స్మరణతో గ్రామం మార్మోగింది. ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్య భగవానుడి కల్యాణం బుధవారం రాత్రి కన్నులు పండుగగా జరిగింది. వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో వచ్చిన భక్తులు దర్శనం కోసం ఆలయం లోపల, బయట బారులు తీరారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉత్సవ కమిటీ, ప్రతినిధులు, పలువురు నాయకులు పాల్గొన్నారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన సూర్యదేవుని కల్యాణ ఉత్సవాలు ఉత్సాహంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్వామి వారిని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం రథోత్సవాన్ని ప్రారంభించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కోలాటాలు, చిన్నారుల బుర్రకథ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, ఆర్కెస్ట్రా, కేరళ డప్పులు నృత్యం, శక్తి వేషాలు, ఒంటెల ప్రదర్శన, పొడవు మనుషుల విన్యాసాలు, దేవతామూర్తుల ప్రదర్శనలు తదితర వేషదారణలు అందర్ని అలరించాయి. భారీ బాణసంచా కాల్చారు.


పందలపాక వెలమపేటలో స్వామివారి కల్యాణం


గోకవరంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు


ఆకట్టుకున్న కాంతార సినిమా వేషధారణ


అలరించిన మహిళల ప్రత్యేక వేషధారణ